క్లుప్తంగా

బీఐఎస్‌పై విస్తృత ప్రచారం



మాట్లాడుతున్న వినోద్

బీచ్‌రోడ్డు : బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్)పై విస్తృత ప్రచారం చేయాలని సీనియర్ డైరెక్టర్ ఎంఏజే వినోద్ తెలిపారు. ప్రపంచ ప్రమాణాల దినోత్సవం సందర్భంగా మంగళవారం నగరంలోని ఒక హోటల్లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఐఎస్ చట్టం 2016 ప్రకారం ప్రామాణీకరణ, మార్కింగ్, నాణ్యత ధ్రువీకరణ కోసం అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. బీఎస్‌ఐపై అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైజాగ్ స్టీల్ జీఎం రుచిరా గుప్తా, ఐఐఎం అసిస్టెంట్ ప్రొఫెసర్ దీపికా గుప్తా తదితరులు పాల్గొన్నారు.

జలమార్గాల సంరక్షణపై ప్రజల్లో చైతన్యం

అల్లిపురం : సౌత్ జైలురోడ్డులో గల విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ నదుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు ముడసర్లోవ రిజర్వాయర్ క్లీనింగ్ ప్రోగ్రాం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నదుల పునరుద్ధరణ, వాటి ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన, జలమార్గాల సంరక్షణకు ప్రజల్లో చైతన్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఎన్‌సీసీ లెఫ్టినెంట్ డాక్టర్ కె. గీతాంజలి, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

బాబ్జీకి జీవన సాఫల్య పురస్కారం


పురస్కారం స్వీకరిస్తున్న బాబ్జీ

మద్దిలపాలెం: నగరానికి చెందిన సాహితీవేత్త, మిసెస్ ఏవీఎన్ డైట్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ రఘుపాత్రుని గణేశ్వర బాబ్జీ సామాజిక సేవకు గాను జీవన సాఫల్య పురస్కారం అందుకున్నారు. తెలంగాణకు చెందిన ఆదర్శ కళానిలయం సంస్థ హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన 28వ వార్షిక వేడుకల్లో ఆయనకు ఈ పురస్కారాన్ని అందించి, సత్కరించింది. ఐపీఎస్ అధికారి రామ్‌రెడ్డి చేతులమీదుగా ఈ పురస్కారాన్ని అందుకున్నట్లు బాబ్జీ తెలిపారు.

భావోద్వేగ విద్య కీలకం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు

విశాఖ సిటీ : సంతోషకరమైన, శాంతియుత ప్రపంచ పౌరులను తీర్చిదిద్దడంలో భావోద్వేగ విద్య ముఖ్య భూమిక పోషిస్తుందని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు తెలిపారు. ఏయూ ఆర్కిటెక్చర్ విభాగం సమావేశ మందిరంలో 'పీస్ కమ్యూనికేషన్ త్రూ ఎమోషనల్ కోషియంట్'పేరిట వర్క్‌షాప్ నిర్వహించారు. దీన్ని ప్రారంభించిన వీసీ మాట్లాడుతూ వ్యక్తిగత, సామాజిక సామరస్యాన్ని పెంపొందించడంలో అంతర్గత శాంతి పునాది అన్నారు. సెంటర్ ఫర్ ఎమోషనల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్ ఆధ్యాత్మిక మేధస్సు విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్ పెరెల్ స్టీన్, డాక్టర్ చల్లా కృష్ణవీర్ అభిషేక్, వెన్నెలకంటి గాయత్రి సంయుక్తంగా రచించిన కోపరహిత సమాజం పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు. అనంతరం ఆచార్య మాట్‌ను జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్కిటెక్చర్ విభాగాధిపతి ఆచార్య రేవతి, విభాగ పరిశోధకలు, విద్యార్థులు పాల్గొన్నారు.


మూలకు చేరిన ఆట పరికరం


రంగులూడి పాలిపోయిన గుర్రం బొమ్మ


విరిగిన ఊయల

ఆడుకునేదెలా?

- వీఎంఆర్‌డీఏ పార్కులో ఆట పరికరాలు శిథిలం
- నిరాశతో వెనుదిరుగుతున్న చిన్నారులు
- పార్కు నిర్వహణను పట్టించుకోని యంత్రాంగం
- అధికారుల నిర్లక్ష్యంపై నందర్శకుల మండిపాటు

పార్క్ అంటేనే పిల్లల ప్రపంచం. నిత్యం చదువుతో కుస్తీ పట్టే చిన్నారులు పార్కులను చూడగానే సీతాకోక చిలుకల్లా రివ్వున ఆడుకోవడానికి పరుగులు తీస్తారు. అలా బుడిబుడి బుజ్జాయిలను ఎంతగానో ఆకట్టుకునే పార్కులను ఆ చిట్టి మనసులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దాల్సిన అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది వీఎంఆర్‌డీఏ (వుడా) పార్కు. ఒకప్పుడు నందర్శకులతో కళకళలాడిన ఈ పార్కు నేడు నిర్వహణ లోపంతో వెలవెలబోతోంది. ముఖ్యంగా పిల్లల్ని మరో ప్రపంచానికి గొని పోయేలా ఉండే ప్లేజోన్ నేడు శిథిలమైన ఆట పరికరాలతో వెక్కిరిస్తోంది.

బీచ్ రోడ్డు : వీఎంఆర్‌డీఏ (వుడా) పార్కుకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. నగరంలోనే అతిపెద్ద ఆహ్లాదకరమైన ఉద్యానవనంగా ఇది పేరు గాంచింది. పర్యాటకులు, సందర్శకులతో నిత్యం సందడిగా ఉండేది. నాడు కళకళలాడిన ఈ పార్కు.. నిర్వహణ లోపంతో నేడు వెలవెలబోతోంది. ఇక్కడి ప్లే జోన్‌లోని ఆట పరికరాలన్నీ శిథిలమయ్యాయి. ఎంతో ఆశగా పార్కుకు వచ్చే చిన్నారులు ఆడుకునే వీలు లేక నిరాశకు గురవుతున్నారు. పార్కు దుస్థితికి వీఎంఆర్‌డీఏ అధికారుల నిర్లక్ష్యమే కారణమని పిల్లల తల్లిదండ్రులు, సందర్శకులు ఆరోపిస్తున్నారు.

రూ.30 కోట్లతో అభివద్ధి..

స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా 37 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ పార్కును జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ సంయుక్తంగా రూ.30 కోట్లతో అభివృద్ధి చేశాయి. ఈ పనుల్లో పార్కు ప్రధాన ముఖద్వారం, పచ్చదనం మినహా సందర్శకులను ముఖ్యంగా చిన్నారులను ఆకర్షించేలా ఎటువంటి అభివృద్ధి చేయలేదని చెప్పాలి. ప్రత్యేక ప్లే జోన్లు, వాటర్ ఫౌంటెయిన్లు, ఆకర్షించే ఆకృతుల వంటివేవీ ఏర్పాటు చేయలేదు. దీంతో పార్కుకు వచ్చేందుకు సందర్శకులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు.

గతంలో రెండు ప్లే జోన్లు..

ఈ పార్కులో గతంలో చిన్నారులు ఆడుకునేందుకు రెండు ప్లే జోన్లు ఉండేవి. పార్కు అభివృద్ధిలో భాగంగా ప్లే జోన్ల సంఖ్య పెంచాల్సింది పోయి.. ఒక జోన్‌కే పరిమితం చేశారు. అది కూడా ప్రధాన ముఖద్వారానికి చాలా దూరంగా ప్లే జోన్ ఏర్పాటు చేశారు. దాని వద్దకు తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకుని చాలా దూరం నడుచుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో ప్రధాన ముఖద్వారం దాటిన వెంటనే ఎడమ వైపు ప్లే జోన్ ఉండేది. తల్లిదండ్రులు అక్కడ తమ పిల్లలను ఆడించి తిరిగి ఇంటికి తీసుకెళ్లిపోయేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు.

పాడైన ఆట వస్తువులు..

పార్కులో ఎక్కడో మూలనున్న ప్లే జోన్‌లో అతి తక్కువ ఆట పరికరాలు ఏర్పాటు చేసినప్పటికీ.. నిర్వహణ లోపం వల్ల వాటిలో సగానికి పైగా ఆట పరికరాలు పాడయ్యాయి. ఎంతో ఆశగా కష్టపడి నడుచుకుంటూ వెళ్లిన చిన్నారులు పాడైపోయి ఉన్న ఆట పరికరాలను చూసి నిరాశా నిస్పృహలకు లోనవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పార్కులో సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, సందర్శకులు కోరుతున్నారు.


పాడైన పరికరం


దెబ్బతిన్న జారుడు బల్ల


ప్లే జోన్‌లో పాడైన ఆట పరికరాలు

పోషకాహారంతో హృదయం పదిలం

బీచ్‌రోడ్డు : ప్రతిరోజు పోషకాహారం తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని డాక్టర్ రోహిణి అన్నారు. ప్రపంచ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని బీచ్ రోడ్డులోని ఓ హోటల్లో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 29న హృదయ దినోత్సవం జరుపుకుంటారన్నారు. ఆ రోజున పలు సంస్థలు కలిసి హృదయ సంబంధ వ్యాధుల గురించి అవగాహన కల్పించేందుకు, ఆ వ్యాధి నివారణకు ప్రయత్నిస్తారన్నారు. రోజువారీ ఆహారంలో బాదం వంటి గుండెకు బలం చేకూర్చే ఆహారాన్ని చేర్చడం ఉత్తమం అన్నారు. ప్రొటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, జింక్, ఫైబర్, మెగ్నీషియం, పొటాషియంతో సహా 15 ముఖ్యమైన పోషకాలతో హృదయానికి ప్రయోజనం కలుగుతుందన్నారు. కొన్ని బాదం పప్పులను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల ఎల్‌డీఎల్ కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించడంలో సహాయపడుతుందన్నారు.

ఫుట్‌బాల్ విజేతలకు రిజిస్ట్రార్ అభినందన


ఫుట్‌బాల్ విజేత జట్టుతో ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ సిటీ: వైజాగ్ స్టార్స్ 11ఏ సైడ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ విజేతగా నిలిచిన ఏయూ ఉద్యోగుల జట్టును రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు మంగళవారం తన కార్యాలయంలో అభినందించారు. మొత్తం 8 బృందాలు పాల్గొన్న ఈ టోర్నమెంట్ ఫైనల్‌లో ఏయూ ఉద్యోగుల జట్టు ఎస్ఆర్‌కేవీ ఫ్‌సీపై 2–0తో విజయం సాధించింది. ఈ సందర్భంగా ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యానికి క్రీడలు దోహదపడతాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలను అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీన్‌లు ఆచార్య టి.వి.కృష్ణ, టి.షారోన్‌రాజు, ఫుట్‌బాల్ టీం కార్యదర్శి సి.హెచ్.రమేష్, సభ్యులు డి.కె.ప్రభు, ఎ.సతీష్‌కుమార్, కె.నాగరాజు, జి.శ్రీనివాస్, పీతల అమరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం


కృష్ణా కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు


ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన


ఏయూలో విద్యార్థులను సత్కరిస్తున్న జాతీయ సేవా పథకం అధికారులు



సమత కళాశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

మద్దిలపాలెం : డాక్టర్ వి.ఎస్. కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ. విజయబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్‌లో విద్యార్థులు 'నాకోసం కాదు – మీకోసం'అనే నినాదంతో సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు తరగతి గదికే పరిమితం కాకుండా, సేవలో భాగస్వాములు కావడం ద్వారా మానవీయ విలువలతో పాటు సమాజం పట్ల బాధ్యత పెరుగుతుందన్నారు. ప్రోగ్రామ్ అధికారులు ఆ దిశగా విద్యార్థులను నడిపించాలని కోరారు. అనంతరం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ కార్యకర్తగా ఉన్న విద్యార్థులు వ్యక్తిత్వ వికాస నిపుణులుగా నిలుస్తారన్నారు. ఎలాంటి గడ్డు పరిస్థితులనైనా ఎదుర్కొనే విధంగా తయారవుతారని పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్‌డే సందర్భంగా పాటల పోటీలు, వక్తృత్వ పోటీలు, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఆయా పోటీల్లో గెలుపొందిన ప్రతి ఒక్కరికి సర్టిఫికెట్లు, బహుమతులు అందించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పోల ఉమామహేశ్వరరావు, టి. శామ్యూల్ డేవిడ్‌రాజ్, జి.వి. ప్రతాప్, బి. లక్ష్మి, అకడమిక్ కో–ఆర్డినేటర్, అధ్యాపకులు, విద్యార్థులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సమత కళాశాలలో..

ఎంవీపీకాలనీ : ఎంవీపీ కాలనీ సమత డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ఆచార్య హరినాథ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు చదువుతో పాటు సేవా గుణం కూడా ఉండాలన్నారు. ఇదే లక్ష్యంతో యువతలో స్ఫూర్తి నింపేందుకు జాతీయ సేవా పథకాన్ని కేంద్ర యువజన వ్యవహారాల మంత్రిత్వశాఖ నిర్వహిస్తోందన్నారు. దశాబ్దాలుగా కోట్ల మంది విద్యార్థులను ఎన్ఎస్ఎస్ సేవా దృక్పథం వైపు నడిపించిందన్నారు. అనంతరం విద్యార్థులు కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన భారతదేశ నిర్మాణానికి కృషి..

విశాఖ సిటీ : స్వచ్ఛమైన భారతదేశ నిర్మాణం గాంధీజీ కల అని, ఆ దిశగా జాతీయ సేవా పథకం ప్రోగ్రాం అధికారులు, వలంటీర్లు కృషి చేయాలని మిజోరాం యూనివర్సిటీ సోషల్ వర్క్ ప్రొఫెసర్ డాక్టర్ కొట్టు శేఖర్ పిలుపునిచ్చారు. జాతీయ సేవా పథక దినోత్సవం సందర్భంగా ఏయూ సెమినార్ హాల్లో గాంధీ–స్వచ్ఛభారత్, జాతీయ సేవా పథకం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని గొప్ప మార్పుల్లో ఒకటి స్వచ్ఛభారత్ అన్నారు. అపరిశుభ్రత వల్ల సంభవించే 3 లక్షల మరణాలు తగ్గాయని, మహిళలకు భద్రత ఏర్పడిందని, భూగర్భ జలాలు కలుషిత సమస్య తీరిందన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఏయూ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు మాట్లాడుతూ స్వచ్ఛభారత్ అనేది ఈనాటి విషయం కాదని, స్వాతంత్య్రం కంటే స్వచ్ఛత గొప్పదని గాంధీజీ అన్నారని గుర్తు చేశారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఏయూ జాతీయ సేవా పథకం కో–ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరినాథ్ మాట్లాడుతూ స్వచ్ఛభారత్ అభియాన్ అమల్లోకి వచ్చి పదేళ్లు అయిందన్నారు. జాతీయ సేవా పథకం ఈ స్వచ్ఛభారత్‌ను ముందుకు తీసుకెళ్లడంలో ఎంతో కృషి చేసిందని తెలిపారు. సమావేశంలో జాతీయ సేవా పథక లక్ష్యాల్లో స్వచ్ఛభారత్ ప్రాధాన్యతను జిల్లా ప్రోగ్రాం అధికారి భాగ్యలక్ష్మి వివరించారు. అంతకు ముందు గాంధీ చిత్రపటానికి సర్వోదయ నాయకుడు డాక్టర్ రావిప్రోలు సుబ్రహ్మణ్యం పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం డాక్టర్ వి.ఎస్.కృష్ణా కళాశాల వలంటీర్లు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయాదేవి వందన సమర్పణ చేయగా, విజయనగరం జిల్లా ప్రోగ్రాం అధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతోనే వ్యాధుల కట్టడి


కేఆర్ఎం కాలనీలో పర్యటిస్తున్న జిల్లా మలేరియా అధికారి తులసీరాజ్

మద్దిలపాలెం : డెంగ్యూ, మలేరియా జ్వరాల నుంచి రక్షణకు ముందస్తు జాగ్రత్తే శ్రీరామరక్ష అని జిల్లా మలేరియా అధికారి తులసీరాజ్ అన్నారు. జీవీఎంసీ 16వ వార్డు కేఆర్ఎంకాలనీలో నమోదైన డెంగ్యూ పాజిటివ్ కేసు సోకిన వ్యక్తి ఇంటిని ఆమె మంగళవారం సందర్శించారు. డెంగ్యూ సోకడానికి గల కారణాలు ఆరా తీశారు. ఇంటి పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి శుక్ర, మంగళవారాలు డ్రైడే పాటించాలని, ఆరోజు ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను తొలగించుకోవాలని సూచించారు. ఇంటి వద్దకు వచ్చే యాంటీ మలేరియా బృందాలకు సహకరించాలన్నారు. వారి సూచనలు పాటించాలన్నారు. అనంతరం ఏఎన్ఎం, ఆశ, ఏఎల్‌వో సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి పరిసరాల్లో నీటి నిల్వలను గుర్తించి తొలగించాలన్నారు. ఇంట్లో ఫ్రిడ్జిలు, ఏసీల ద్వారా వచ్చే నీటిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని పేర్కొన్నారు. వారం పైబడి ఉండే నీటి నిల్వలు దోమలకు ఆవాసాలుగా మారతాయని తెలిపారు. దోమ కాటు ద్వారా మలేరియా, డెంగ్యూ జ్వరాలు వ్యాప్తి చెందుతాయనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాత వెంకోజీపాలెం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రెహినిషా, మలేరియా సబ్ యూనిట్ అధికారులు నగేష్ పట్నాయక్, శేషుబాబు, సిబ్బందితో పాటు, జీవీఎంసీ యాంటీ మలేరియా బృందం సభ్యులు పాల్గొన్నారు.

కుట్రపూరిత చర్యలు విడనాడాలి


జీవీఎంసీ గాంధీ పార్కులో దీక్షలో పాల్గొన్న ఐఎఫ్‌టీయూ నాయకులు

సీతమ్మధార : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగిస్తున్న కుట్రపూరిత చర్యలను విడనాడాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ పార్కులో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షలు 1277వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కుట్రపూరిత చర్యలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే రూ. 11 వేల కోట్లు వర్కింగ్ క్యాపిటల్‌గా కేటాయించాలన్నారు. స్వచ్ఛంద పదవీ విరమణ పథకాన్ని నిలిపేయాలని, ఇతర స్టీల్‌ప్లాంట్లకు కార్మికులను బదిలీ చేసే చర్యలను ఆపేయాలని కోరారు. కూటమి నాయకులు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలన్నారు. గంగవరం పోర్టును ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలన్నారు. డిమాండ్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోకపోతే రాబోయే కాలంలో సమరశీల ఉద్యమాల్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సూరప్పుడు, ఐఎఫ్‌టీయూ నాయకుడు వై.కొండయ్య, జిల్లా అధ్యక్షుడు కె.మల్లయ్య, తిరుపతిరావు, భూషణం తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌టీఎస్ కూడళ్లలో గజి'బిజీ'

రోడ్డు దాటాలంటే వాహన చోదకులు, పాదచారుల అవస్థలు


చినగదిలి సాయిబాబా ఆలయం కూడలిలో గజిబిజిగా వాహనాలు

ఆరిలోవ: హనుమంతవాక నుంచి అడవివరం వరకు ఉన్న బీఆర్‌టీఎస్ రోడ్డులో కూడళ్లు గజిబిజిగా మారాయి. ఈ జంక్షన్లలో వాహనాలు ఎటు నుంచి ఎటు వైపు వెళతాయో తెలియని పరిస్థితి. బీఆర్‌టీఎస్‌లో పాత పందులపారం (విమ్స్ గేటు ఎదురుగా), పెదగదిలి, చినగదిలి, దీన్‌దయాల్‌పురం, రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం, పైనాపిల్ కాలనీల వద్ద కూడళ్లు ఉన్నాయి. వాటిలో పాత పందులపారం, పెదగదిలి, చినగదిలి, దీన్‌దయాల్‌పురం వద్ద కూడళ్లు నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటాయి. ఐదు లైన్ల రోడ్డు కావడంతో ఆయా కూడళ్లలో ఏ లైన్‌లో ఏయే వాహనాలు వస్తుంటాయో గమనించలేకపోతున్నారు. దీంతో ఈ కూడళ్లలో రోడ్డు దాటడానికి వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఇక పాదచారులకు అది పెద్ద పరీక్షే. పలు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి వస్తున్న విద్యార్థులకు మరింత ఇబ్బంది కలుగుతోంది. ఉదయం, సాయంత్రం సమయాలలో పాఠశాలలు, కళాశాలల బస్సుల కోసం విద్యార్థులు ఈ కూడళ్లు దాటాల్సి వస్తోంది. నిత్యం ఈ కూడళ్ల వద్ద ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ అందుబాటులో ఉంచాలని, ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ ఉండాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

2న రోటరీ మెగా బ్యాడ్మింటన్ టోర్నమెంట్

సీతంపేట : అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ ఆధ్వర్యంలో మెగా బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు క్లబ్ ప్రెసిడెంట్ ఎం.డి.యాసిన్ బాబా తెలిపారు. శంకరమఠం రోడ్‌లో గల ఆఫీసులో క్లబ్ ప్రతినిధులతో కలిసి టోర్నీ పోస్టర్లు మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పురుషులు, మహిళలకు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. 48 టీమ్‌లు టోర్నమెంట్‌లో పాల్గొంటాయన్నారు. క్లబ్ సెక్రటరీ చింతా నేతాజీ మాట్లాడుతూ ఆసక్తి కలిగిన క్లబ్ సభ్యులు పేర్లను ఈ నెల 28లోగా రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. వివరాల కోసం టోర్నమెంట్ కమిటీ చైర్మన్ డాక్టర్ అశోక్ 98663 46347ను సంప్రదించాలని కోరారు.

ముఖ్యమంత్రి దృష్టికి ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

ఎంవీపీకాలనీ: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తానని విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే, ఎస్ఎంయూ గౌరవ అధ్యక్షుడు విష్ణుకుమార్‌రాజు పేర్కొన్నారు. వాల్తేర్ ఆర్టీసీ డిపో మేనేజర్, యాజమాన్యం తీరుకు నిరసనగా ఏపీఎస్ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు కొద్దిరోజులుగా దీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఎస్ఎంయూ ఆధ్వర్యంలో వాల్తేర్ డిపో దరి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో విష్ణుకుమార్ రాజు మాట్లాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఆర్టీసీ యాజమాన్యం పిచ్చి సాకులు చెబుతోందన్నారు. వాల్తేర్ డిపోతో పాటు విశాఖ ప్రాంతీయ కేంద్రం పరిధిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు తన దృష్టికి వచ్చాయన్నారు. విశాఖ రీజనల్ మేనేజర్ తీరు సైతం ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేసే విధంగా ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగుల సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకు ఎస్ఎంయూ ఆధ్వర్యంలో సంబంధిత మంత్రితో సమావేశం కానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు మాట్లాడారు. ఎస్ఎంయూ అసోసియేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు గండి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి వసంతరావు, జోనల్ అధ్యక్షుడు మూర్తి, కార్యదర్శి కుమార్, రీజనల్ అధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి నీలకంఠం, డివిజనల్ అధ్యక్షుడు శివాజీ, కార్యదర్శి వీఎస్ఆర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.